క్లుప్తంగా

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వృత్తి విద్యా విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యాక్రమంలో భాగంగా సోమవారం ఉదయం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిందూపురం పట్టణంలోని సూపర్ మార్ట్‌ను సందర్శించారు. విద్యార్థులకు రిటైల్ అండ్ హోల్‌సేల్ గురించి అవగాహన పరిచినట్లు వృత్తి విద్యా ఉపాధ్యాయుడు ఎస్‌కే జియా తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ కార్యాక్రమంలో 10 రోజులు పాటు వివిధ మార్ట్‌లను సందర్శించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

నేడు జ్యోతుల ఉత్సవం



వడిసిలమ్మ దేవతను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పంచాయతీలోని వివిధ గ్రామాల ప్రజలు మంగళవారం వడిసిలమ్మ, గౌడుసంద్ర మారెమ్మ దేవతలకు జ్యోతుల ఉత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం ఆర్.ఆనంతపురం గ్రామం నుంచి వడిసిలమ్మ దేవతను హరేసముద్రం గ్రామానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం దేవతకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

సజావుగా ప్రవేశ పరీక్ష

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. మొత్తం 141 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. 132 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఓబుళపతి తెలిపారు.

అగళి: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి సోమవారం పరీక్ష నిర్వహించారు. 87 మంది విద్యార్థులకు గాను 66 మంది హాజరయ్యారని ఎంఈఓ-2 చంద్రశేఖర్,చీఫ్ సూపరింటెండెంట్ జాఫర్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

పెనుకొండ: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణ సమీపంలోని వై జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ తప్పక ధరించాలని, సెల్ ఫోన్‌లలో మాట్లాడుతూ అతివేగంగా వాహనాలు నడపరాదన్నారు. మలుపుల్లో జాగ్రత్తగా వెళ్లాలని తెలియజేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

ఉపాధ్యాయురాలి మృతి



కావ్యదీప (ఫైల్)

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు కావ్యదీప (24) తీవ్ర జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పెనుకొండలోని వజ్రాలపేటలో నివాసం ఉంటున్న కావ్యదీప రొద్దంలోని ఎంజేపీ పాఠశాలలో పనిచేస్తున్నట్లు తెలిపారు. భార్య మృతి చెందడంతో భర్త జగదీష్ భోరున విలపించాడు. తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



నృత్యం చేస్తున్న మహిళలు

పావగడ: భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ ఆదర్శ ప్రాయుడు. అతడి అడుగుజాడల్లో నడిచి బడుగు బలహీన వర్గాలకు సామాజిక సేవలందించాలని స్థానిక దళిత నాయకుడు ఎంకే నారాయణప్ప కోరారు. సోమవారం తాలూకాలోని మీనకుంటన హళ్లి గ్రామంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళలు అంబేడ్కర్‌పై పాటలు పాడుతూ నృత్యం చేశారు. అంబేడ్కర్ చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు జ్యోతులు ఊరేగించారు.

సిరులు కురిపిస్తున్న వక్క

- మార్కెట్‌లో క్వింటా రూ.55 వేల వరకూ పలుకుతున్న ధరలు
- గత ఏడాదితో పోలిస్తే నిలకడగా ధరలు
- లాభాలు ఆర్జిస్తున్న రైతన్నలు



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధం చేసిన వక్క బస్తాలు



రంగు వేసి వక్కలను ఆరబెట్టిన దృశ్యం

అమరాపుర: నియోజకవర్గంలోని వక్క రైతులకు ఈ ఏడాది అదృష్టం కలిసొచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వక్క ధరలు నిలకడగా ఉండటంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. జిల్లాలోనే వక్క ఉత్పత్తిలో మడకశిర నియోజకవర్గం మొదటి స్థానంలో ఉంది. ఈ నియోజకవర్గంలో ఎక్కువగా అమరాపురం మండలంలో వక్కను రైతులు పండిస్తున్నారు. దాదాపు ఈ నియోజకవర్గంలో 5 వేల ఎకరాల వరకూ వక్క తోటలు ఉండగా.. ఒక్క అమరాపురం మండలంలోనే దాదాపు 4 వేల ఎకరాల వరకూ వక్క తోటలు ఉండటం విశేషం. ఈ నియోజకవర్గంలో ఎలాంటి సాగునీటి పథకాలు లేవు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతం రైతులు ఎక్కువగా వేరుశనగ, వక్క, చింతపండు, పట్టుగూళ్లను ఉత్పత్తి చేస్తున్నారు. అయితే వేరుశనగ పంటలో ప్రతి ఏడాది నష్టాలు చవిచూస్తున్న రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రాంతం రైతులను వక్క, చింతపండు, పట్టుగూళ్లు ఆదుకుంటున్నాయి. గత ఏడాది వక్కకు ధర తక్కువగా ఉండటంతో రైతులు తమ ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్లో మంచి నాణ్యమైన వక్క క్వింటా రూ.53 వేల నుంచి రూ.55 వేల వరకూ ధర పలుకుతోంది. దీంతో రైతులు తమ ఇంటి వద్దనే వక్కను అమ్ముకుంటున్నారు. ఈ సమయంలో వక్క ధరలు నిలకడగా ఉండటంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది క్వింటాల్ వక్క ధర రూ.42 వేల వరకూ మాత్రమే పలికింది. అయితే ఈ ఏడాది గరిష్ఠంగా రూ.55 వేల వరకూ పలుకుతుండటంతో పెట్టుబడి ఖర్చులన్నీ పోనూ రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు.

తగ్గిన దిగుబడి..

ఇదిలా ఉండగా.. వక్క ధరలు బాగానే ఉన్నా దిగుబడి మాత్రం గత ఏడాది కంటే తగ్గడంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది మొదట్లో వర్షాలు రాకపోవడంతో పాటు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పూత, గెలల నుంచి వక్క చెట్లలోనే ఎండి పోయింది. వక్క దిగుబడి తగ్గడానికి ఇది ప్రధాన కారణంగా రైతులు చెబుతున్నారు. అదే విధంగా భూగర్భ జలమట్టం



తగ్గడం, బోరుబావులు ఎండిపోవడం తదితర కారణాలతో వక్క తోటలకు రైతులు సకాలంలో నీళ్లను కట్టలేకపోయారు. ఫలితంగా వక్క కాయల దిగుబడి తగ్గిందని చెప్పుకోవచ్చు. కూలీల ధరలు మాత్రం గత ఏడాదికంటే ఈ ఏడాది పెరిగాయి. ఈ కారణంతో వక్క రైతులకు పెట్టుబడి ఖర్చు కొంతమేరకు పెరుగుతోంది. ధర నిలకడగా ఉండటంతో వక్క వ్యాపారులు కూడా లాభాలు పొందుతున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని చాలా మంది రైతులు పచ్చి వక్క కాయలను వ్యాపారులకు ముందుగానే విక్రయించారు. పచ్చి వక్క కాయలు క్వింటాల్ రూ.7 వేల వరకు వ్యాపారులకు రైతులు విక్రయించారు. ఈ నేపథ్యంలో ధర బాగా ఉండటంతో రైతులతో పాటు వ్యాపారులు కూడా లాభాలు పొందుతున్నారు. ఈ ఏడాది ధర నిలకడగా ఉండటంతో వక్క రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడం విశేషం.

వక్కసాగు వివరాలు..

మడకశిర నియోజకవర్గంలో వక్కసాగు	5 వేల ఎకరాలు
మార్కెట్ ప్రాంతాలు	శివమొగ్గ, భీమసముద్రం, తుమకూరు, బెళ్గావి, అరసికెర
నాణ్యమైన వక్క క్వింటా ధర	రూ.53 వేల నుంచి రూ.55 వేలు

లాభాలు వస్తున్నాయి



ఈ ఏడాది వక్క ధరలు నిలకడగా ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి క్వింటాల్ వక్క ధర రూ.53 వేల వరకూ పలికింది. గతంలో కంటే ఈ సారి ధర బాగా ఉండటంతో లాభాలు ఆర్జిస్తున్నాం. అయితే దిగుబడి తగ్గడం కూలీల ధర పెరగడం కొంత వరకూ ఇబ్బందికరంగా మారింది.

– మల్లికార్జున, గౌడనకుంట

మార్కెట్ యార్డు నిర్మించాలి



మడకశిర నియోజకవర్గంలోనే అత్యధికంగా అమరాపురం మండలంలో వక్క తోటలు ఉన్నాయి. వక్క తోటలను బోరు బావుల కింద సాగు చేయడం జరుగుతోంది. ఎలాంటి కాలువలు లేవు. మండలంలో వక్క మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి. అధికారులు అదిగో అప్పుడు చేస్తాం.. ఇదిగో అంటున్నారే తప్ప నిర్మాణం మాత్రం చేపట్టలేదు. దీంతో వక్కను దళారులకు తక్కువ ధరలకు విక్రయించాల్సి వస్తోంది. వక్క తరుగుతో పాటు కమీషన్ కూడా ఇవ్వాల్సి రావడంతో ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం వెంటనే మార్కెట్ యార్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– ఈరముద్దప్ప, మద్దనకుంట

ధరలు బాగున్నాయి



గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం వక్క ధరలు బాగున్నాయి. నాకున్న ఎకరా పొలంలో వక్కతోట సాగు చేశా. దీంతో పాటు అదనంగా వక్క తోటలను గుత్తకు తీసుకుని వ్యాపారం చేస్తాను. ప్రస్తుతం క్వింటా రూ.54 వేలు ధర పలుకుతోంది. ధరలు ఇలాగే ఉంటే రైతులకు లాభాలు వస్తాయి. నాకు ఈ ఏడాది ఖర్చులన్నీ పోనూ రూ.5 లక్షల వరకూ ఆదాయం వచ్చింది.

– నాగరాజు, తమ్మడేపల్లి

నిందితులు న్యాయవాదులను సంప్రదించాలి



మాట్లాడుతున్న శివప్రసాద్ యాదవ్

హిందూపురం అర్బన్: కేసుల వివరాలు తెలుసుకునేందుకు నిందితులు తరచూ న్యాయవాదులను సంప్రదించే అవకాశం ఉందని జిల్లా న్యాయ అధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ జైలును న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ చేశారు. బంధువులు, కుటుంబీకుల ద్వారా న్యాయవాదులకు సమాచారం అందించి కలుసుకోవచ్చన్నారు. ఉప కారాగారంలో ఉన్న ఖైదీలు ఎవరెవరు ఎలాంటి కేసుల్లో జైలుకు వచ్చారు? ఎప్పుడు వచ్చారు? ఎప్పటి నుంచి ఉంటున్నారు. న్యాయవాదులను పెట్టుకున్నారా? వైద్య సదుపాయం , భోజన వసతి ఎలా ఉంది అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్థికస్థోమత లేక న్యాయవాదులను పెట్టుకోలేని పరిస్థితి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. 18 ఏళ్ల లోపు వారు, 70 ఏళ్లు పై బడిన వారు జైలులో ఉంటే తెలియజేయాలన్నారు. కారాగారంలో అధికారులు , సిబ్బంది కుల వివక్ష చూపుతుంటే వెంటనే దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు ఖైదీలు తమకు ఆరోగ్యం బాగాలేదని తెలపడంతో తక్షణం వారికి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జైలు సూపరెంటెండెంట్ హనుమప్పకు సూచించారు. కార్యదర్శి వెంట న్యాయవాదులు కళావతి, సంతోషికుమారి, మురళి, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, జైలు సిబ్బంది ఉన్నారు.

ఖైదీల సమస్యలపై ఆరా

పెనుకొండ: పట్టణంలోని సబ్ జైలులో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ ఖైదీల సమస్యలపై ఆరా తీశారు. సోమవారం ఆయన సబ్ జైలును సందర్శించారు. న్యాయవాదులను నియమించుకోలేని వారికి ప్రభుత్వ న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని, ఆరోగ్య సమస్యలుంటే తెలియజేయాలన్నారు. అనంతరం జైలు లోపల తనిఖీ చేశారు. శుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది శరత్‌బాబు, పీసీవీ నరసప్ప పాల్గొన్నారు.

24న కలెక్టర్ వద్ద ధర్నా

సోమందేపల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24న పుట్టపర్తిలోని కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రవి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ధర్నాకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, నాయకులు ఆదిరెడ్డి, నారాయణప్ప, నాగరాజు, భాగ్యమ్మ, సరస్వతమ్మ సాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి పాలన విధించండి

పెనుకొండ రూరల్: హింసాత్మకంగా మారిన పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు విశ్వహిందూ పరిషత్ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ పశ్చిమ బెంగాళ్ రాష్ట్రంలో అన్యమతస్తులు, వలసదారులు నిరంతం ఏదో ఒక రకంగా అల్లర్లు సృష్టిస్తూ అశాంతి కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణప్ప, ఉదయ భాను, మురళి,కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించాలి

మడకశిర: పట్టణంలో పేరుకుపోయిన చెత్తను రెండు రోజుల్లో తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్థానిక కౌన్సిలర్లను కోరారు. సోమవారం ఆర్అండ్‌బీ బంగ్లాలో కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కనుమ మారెమ్మ జాతర సందర్భంగా పట్టణంలో చెత్తా చెదారం తొలగించాలని తెలిపారు.

న్యాయవాది బిర్లాజీరావుకు నివాళి

హిందూపురం అర్బన్: స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఇటీవల మృతి చెందిన న్యాయవాది బిర్లాజీరావుకు సంతాప సభ ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిర్లాజీరావు ఎంతో మంది పేద ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం చేశారన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వన్నూరప్ప, కార్యదర్శి రామచంద్రప్పతో పాటు న్యాయవాదులు రామచంద్రారెడ్డి, శ్రీరాములు, సుదర్శన్, మనోహర్‌రెడ్డి, రమేష్, సిద్ధూ తదితరులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లపై నిరసన



హిందూపురంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆ పాఠశాల ఎదుట సోమవారం పీడీఎస్‌యూ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాలలో ముందుస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తూ యూకేజీ నుంచి 10వ తరగతి వరకు రూ.22వేల నుంచి రూ.34 వేల వరకు ఫీజులు వసూ చేస్తున్నారన్నారు. అలాగే పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు, ఇతర సామాగ్రి కొనాలని నిబంధన పెట్టి రూ.9వేల వరకు మరో రూపంలో ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి భగత్, నందీష్, నాయకులు రాజ, దిలీప్, నరేష్, అక్షయ్, కుమార్, నరేంద్ర, లోకేష్, ప్రవీన్, తిప్పేస్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

గోరంట్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న నారాయణ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని పుట్టపర్తిలోని కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఎస్ఎఫ్‌ఐ నాయకుడు ప్రసాద్ కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. నారాయణ ఇంగ్లిష్ మిడియం పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ లక్ష్మీపతి ఇటీవల విద్యార్థినులపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, ఓ విద్యార్థినిపై లైంగికదాడికి యత్నించారని దీంతో పోలీసులు లక్ష్మీపతిపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు.

ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా శ్రీనాథ్

రొళ్ల: మండల ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా ఎం.రాయాపురం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న శ్రీనాథ్‌ను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం రెగ్యూలర్ ఈఓఆర్డీగా పని చేస్తున్న క్రిష్టప్ప ఇటీవల బత్తలపల్లి మండలానికి బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనాథ్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఘనంగా స్కూల్ డే

హిందూపురం టౌన్: పట్టణంలోని మౌలానా ఆజాద్ మున్సిపల్ పాఠశాలలో స్కూల్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ గంగప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలను అందించారు. అలాగే పాఠశాలలో 22 ఏళ్ల పాటు సేవలందిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుడు అఖియార్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన భార్య జబిన్ తాజ్‌ను ఎంఈఓ, ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ, సీఆర్పీ సల్మా, స్వప్న, ఉష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపకరణాల పంపిణీ

రొళ్ల: స్థానిక భవిత కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు అలింకో కంపెనీ వారు సమకూర్చిన ఉపకరణాలను ఎంఈఓ శ్రీధర్ చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు భవిత కేంద్రం ఐఈఆర్టీలు శిరీష, నవీన్ తెలిపారు. ఒక సీపీ చైర్, ఒక వీల్ చైర్‌తో పాటు రెండు టీఎల్‌ఎం కిట్స్‌ను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం, ఎంపీపీఎస్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

లేపాక్షి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు.. లేపాక్షికి చెందిన ఓబులేశు(45) రైతు కుర్లపల్లికి సమీపంలో ఉన్న పొలానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. జాతీయ రహదారి నుంచి కొండూరు రోడ్డు క్రాస్ దాటుకునే సమయంలో హిందూపురం నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే జాతీయ రహదారి అంబులెన్స్‌లో అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి పోరాటాలు ఆగవు



ఉద్యమకారులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువులకు ఎత్తినహొళె సాగు నీటి పథకం కింద నీరు నింపే వరకూ నీటి పోరాటాలు ఆగవని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో నీటి కోసం పోరాడిన ఉద్యమకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హొసపేటె జలాశయం నుంచి పావగడకు తాగు నీరు అరకొరగా వచ్చినా.. భద్ర మేల్దండె, ఎత్తిన హొళె సాగు నీటి ప్రాజెక్టుల నుంచి పావగడ చెరువులకు నీరు వెంటనే నింపాలన్నారు. లేని పక్షంలో పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. తాగు, సాగు నీటి సాధనకు చాలా కాలంగా పోరాడుతున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప మాట్లాడుతూ.. గతంలో తాగు, సాగు నీటి కోసం పావగడ నుంచి బెంగుళూరు వరకూ పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. అప్పటి ఎమ్మెల్సీ ఉగ్రప్ప, స్వామి జపానంద నేతృత్వంలో సీఎం సిద్ధరామయ్యను కలిసి నీటి పథకాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అనంతరం నీటి కోసం పోరాడిన సుమారు 200 మంది ఉద్యమకారులను సన్మానించారు. కార్యక్రమంలో హనుమంత స్వామి, పావగడ సమగ్ర నీటి పోరాట వేదిక అధ్యక్షుడు శివ ప్రసాద్, కార్యదర్శి సొగడు వెంకటేశ్, మాజీ ఎంపి జనార్ధన స్వామి, ఆర్సీ అంజినప్ప, తదితర పదాధికారులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

పెనుకొండ రూరల్: పిడుగు పడి పాక్షికంగా కాలిపోయిన ఇంటిని తహసీల్దార్ శ్రీధర్ సోమవారం పరిశీలించారు. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి మండలంలోని దుద్దేబండలో రైతు నారాయణప్ప ఇంటిపై పిడుగు పడింది. ఇంట్లోని నిత్యావసరాలు కాలిపోవడంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మోస్తరు వర్షం

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గంలో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. మడకశిర మండలంలో 26.6 మి.మీ, అమరాపురం 34.6 మి.మీ, గుడిబండ 19.6 మి.మీ, అగళి 28.8 మి.మీ, రొళ్ల 14.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

పెనుగాలులకు నేలరాలిన మామిడి కాయలు


అమరాపురం: మద్దనకుంట, అమరాపురం, హలుకూరు, తమ్మడేపల్లి, వలస, గౌడనకుంట, ఉదుగూరులో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. మద్దనకుంటలో రైతు దేవరాజు సాగు చేసిన మామిడి తోటలో కాయలు నేలరాలి రూ.30 వేల మేర నష్టం వాటిల్లింది.

సోమందేపల్లి: మండలంలోని సుద్దకుంటపల్లిలో ఆదివారం రాత్రి గాలీవానకు పొలంలో మామిడికాయలు నేలరాలినట్లు బాధిత రైతు ప్రసాద్ తెలిపాడు. దాదాపు రూ.2 లక్షలు వరకు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

నేడు 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'

సోమందేపల్లి: మండలంలోని జూలకుంటలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ మంగళవారం పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

తేజస్వినిని ఆదర్శంగా తీసుకోండి



తేజస్వినిని సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ: విద్యార్థులు తేజస్వినిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని గ్లోబల్‌జెన్ పాఠశాలలో జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 108వ ర్యాంక్ సాధించిన ప్రగతి గ్లోబల్‌జెన్ విద్యార్థిని తేజస్వినికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ 13 ఏళ్లపాటు తమ పాఠశాలలో చదివిన తేజస్విని జేఈఈ మెయిన్స్‌లో 108 వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తేజస్విని మాట్లాడుతూ తనకు సహకారమందించిన తల్లిదండ్రులు, గురువులకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. అనంతరం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు.

'విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు'



మాట్లాడుతున్న కోనంకి అశోక్

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం 8 రకాల పాఠశాలల ఏర్పాటు విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు, చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం మడకశిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ మడకశిర మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 117 రద్దు చేస్తూ ప్రవేశపెడుతున్న నూతన విధానాలు విద్యా రంగానికి మేలు చేయకపోగా హాని చేసేలా ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతులతో ప్రాథమిక పాఠశాల ఉండాలని.. ఆరు నుంచి పది లేదా 12 తరగతుల వరకు ఉన్నత పాఠశాలలు ఉండాలని ఏపీటీఎఫ్ మొదటి నుంచి అభిప్రాయపడుతోందని గుర్తు చేశారు. ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లు కేటాయించి ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులతో బోధించడం శాస్త్రీయం కాదని తెలిపారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి లతారామకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ గవ్వల రామకృష్ణ, మడకశిర మండలశాఖ అధ్యక్షుడు జయరామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్యాంసుదర్, డక్కీనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

మడకశిర: మండల పరిధిలోని భీమరాయనపల్లి సమీపంలో సోమవారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, రూ.90,070 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ నగేష్ తెలిపారు. అలాగే నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు సన్మానం

పరిగి: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. సోమవారం కాలువపల్లి వద్ద ఉన్న విద్యానిధి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినీవిద్యార్థులకు మెమెంటోలతో పాటు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

రొద్దం: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు పంపిణీ చేశారు. ఆయన మట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్నది సాధిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల: మండలంలోని శిరగంవార్లపల్లికి చెందిన ఓ వివాహిత సోమవారం కుటుంబ కలహాలతో విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్

9912220723, 9912220726